క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు



పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీ మణులకు, ప్రజలకు ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి శుక్రవారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా నెల రోజులపాటు ఒక్క పొద్దులు ఉండి శనివారం రంజాన్ పండుగను నిర్వహించుకుంటారని తెలియజేశారు. అల్లా దయం వల్ల నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోరారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ



గురజాల : రంజాన్ పర్వ దినాన్ని పురస్కరించుకుని నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. స్థానిక మర్కస్ మజీద్‌లో వికలాంగులకు శుక్రవారం వస్త్రాలు పంపిణీ చేశారు. మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్ రంజాన్ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్


దాచేపల్లి : దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గొల్ల నాగబాబును జిల్లా ఎస్పీ సస్పెన్షన్ చేశారు. ఓ మైనర్ బాలి కపట్ల లైంగిక దాడి నేపథ్యంలో నాగబాబుపై కేసు నమోదు చేసి పోలీసులు అరెస్ట్ చేయడంతో కోర్టు రిమాండ్‌కు తరలించింది. ఈ నేపథ్యంలో నాగబాబును సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులను జారీ చేశారని సీఐ షేక్ బిలాలుద్దీన్ శుక్రవారం తెలిపారు.

తహసీల్దార్‌గా ప్రవీణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



దాచేపల్లి : మండల తహసీల్దార్‌గా తానంగి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్‌ను తహసీల్దార్‌గా ఇక్కడకు బదిలీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని, ఆన్‌లైన్, రెవెన్యూ పరమైన సమస్యలు ఉన్న రైతులు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆయన చెప్పారు. పలువురు ప్రజా ప్రతినిధులు, కార్యాలయం ఉద్యోగులు, వీఆర్వోలు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానించి అభినందించారు.

వాసవీ అమ్మవారి జన్మదిన నవరాత్రులు



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో గల శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన నవరాత్రులు శుక్రవారంతో ప్రారంభమయ్యాయి. శుక్రవారం అమ్మవారిని రజత కవచ ధారణతో అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు కలశస్థాపన, జెండా ఆవిష్కరన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందేశారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరికి గాయాలు

దుర్గి: మండల కేంద్రం దుర్గి నుంచి మాచర్ల వైపు వెళ్తున్న బైకును ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొనడంతో ఒక వ్యక్తికి తీవ్రగాయాలు అయిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు దుర్గికి చెందిన ఊదర కోటేశ్వరరావు మాచర్ల వైపు వెళ్తుండగా స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో ప్రమాదం జరిగింది. రాజానగరం గ్రామానికి చెందిన పామూరు మహేష్ వేగంగా వచ్చి అదుపు తప్పి కోటేశ్వరరావు బైకును ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రునికి మరుగైన వైద్యం నిమిత్తం నర్సరావుపేటకు తరలించారు.

వ్యక్తిపై దాడి, కేసు నమోదు

మాచవరం: పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలోని మల్లవోలు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బిట్రా వినోద్‌బాబుపై అదే గ్రామానికి చెందిన కోపూరి ఆనంద్‌బాబుతో పాటు మరో ముగ్గురు పాత కక్షలను మనసులో పెట్టుకుని అకాణంగా కర్రతో కొట్టి, రాళ్ల విసరడంతో వినోద్‌బాబుకు గాయాలయ్యాయి. వినోద్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కోటయ్య తెలిపారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ఈద్గా ప్రహరీగోడను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి

మాచర్ల: మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉండి ఏడాదిగా నియోజకవర్గంలోని మసీదులు, షాదీఖానాలను రూ.1.30 కోట్లతో అభివృద్ధి చేసినట్లు అందులో భాగంగానే రూ.50 లక్షలతో మాచర్ల ఈద్గాను నిర్మించడంతో పాటు రూ.33 లక్షలతో నూతనంగా ప్రహరీగోడ నిర్మించడం జరిగిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో 23వ వార్డులో ఈద్గా ప్రహరీగోడను ప్రభుత్వ విప్ పీఆర్కే, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల యువజన విభాగం కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకటరామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ ముస్లిం కుటుంబాలకు ఎప్పుడైనా అండగా ఉంటానని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మైనార్టీలలో ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. రాబోయే రోజుల్లో మైనార్టీల అభివృద్ధి పనులు చేపట్టేందుకు మరో రూ.50 లక్షలు కేటాయిస్తానన్నారు. స్వర్గీయ రాజశేఖరరెడ్డి ముస్లిం కుటుంబాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి వెలుగులు నింపారని ఆయన బాటలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ నుంచి వచ్చే ప్రతి పథకాన్ని మైనార్టీలకు అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ జలీల్, కౌన్సిలర్లు షేక్ మదార్ సాహెబ్, మస్తాన్, సుభాని, కరిముల్లా , దస్తగిరిలు మాట్లాడుతూ తామంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాచర్లలో ప్రభుత్వ విప్ పీఆర్కేకు మద్దతుగా నిలుస్తామన్నారు. పీఆర్కే, పీవీఆర్‌లను మైనార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు ట్రాక్టర్ కరిముల్లా, సీలింగ్ భాషా, షేక్ నాగూర్, బాజీ, పఠాన్‌గౌస్, అల్లా ఉద్దీన్, పలువురు మైనార్టీ నాయకులు, మున్సిపల్ కమీషనర్ జీవీ రమణబాబు, కాంట్రాక్టర్ బ్రహ్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న జిల్లా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

పిడుగురాళ్లరూరల్: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. మండలంలోని జూలకల్లు గ్రామంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జరుగు ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులను ఉదయానే చేపట్టాలని ఆయన సూచించారు. వడదెబ్బకు గురికాకుండా కాపాడుకోవాలన్నారు. గ్రామాల్లో అర్హత కలిగిన కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధార్‌కార్డును బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేయాలని తెలిపారు. ఎండలు పెరిగిపోవడంతో కూలీలు ఉదయం సమయంలోనే పనులను పూర్తి చేసుకుని ఇంటికి చేరుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు తప్పనిసరిగా తీసుకుని వెళ్లాలని తెలియజేశారు. వేసవి దృష్ట్యా పని జరిగే ప్రదేశాలల్లో తగిన వసతులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ రోజు మండలంలో 1700 ల మంది ఉపాధి హామీ పనులకు హాజరయ్యారని, ఇంకా ఎక్కువ మంది హాజరు కావాలని ఆయన సూచించారు. అనంతరం కూలీల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రాజెక్టు ఆఫీసర్ (ఏపీవో) బుచ్చిబాబు, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్ర బాబు, టెక్నికల్ అసిస్టెంట్ రమణ, సునిత, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి విద్యను అభ్యసిస్తే విజయం తథ్యం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



విద్యార్థులకు యూటీఎఫ్ స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పిడుగురాళ్ల: విద్యార్థులు కష్టపడి విద్యను అభ్యసిస్తే విజయం తథ్యమని, జీవితంలో ఎదుగుదల కూడా సులభతరం అవుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ, యూటీఎఫ్, జెవీవీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉచిత పాలిసెట్, ఏపీఆర్‌జేసీ కోచింగ్ సెంటర్‌ను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల సంయుక్తంగా ఈ కోచింగ్ సెంటర్‌ను నిర్వహించటం చాలా సంతోషంగా ఉదన్నారు. విద్యార్థులు సదుపాయాన్ని ఉపయోగించుకొని పాలిసెట్, ఏపీఆర్‌జేసీలో ఉత్తమ ప్రతిభ కనబరి మంచి పేరు తీసుకుని రావాలన్నారు. పదవ తరగతి ద్యార్థులకు వివిధ రంగాల్లో ఉపాధి పొందడానికి గల అనేక కోర్సులు గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం కష్టపడి విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తే తప్పకుండా జీవితంలో ఎంతో సంతోషంగా జీవించవచ్చునన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగాల ధనలక్ష్మీ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. విజయసారధి, ఎస్ఎఫ్ఐ నాయకులు కోటా సాయికుమార్, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, జమాల్, కాశీం, కృష్ణారెడ్డి, శివశంకర్, మరియదాసు, చంద్రశేఖర్, రోశయ్యతదితరులు పాల్గొన్నారు.

గ్రామోదయం సద్వినియోగపర్చుకోండి



బాలింతతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి గబ్రూనాయక్

మాచర్ల రూరల్: గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ సేవలు ప్రజలకు అందే విషయంలో ప్రజల నుంచి స్వయంగా అధికారులు తెలుసుకునేందుకు గ్రామోదయ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను తెలియజేయాలని ఎంపీడీఓ వి కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం మండలంలోని లింగాపురం గ్రామంలో గ్రామోదయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సేవలను నేరుగా ప్రజలకే అందించాలన్న లక్ష్యంతో సచివాలయాలు, రైతు భరోసా, వైఎస్సార్ క్లీనిక్‌లు వారి గ్రామాల్లోనే ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయ సహకారాలందిస్తున్నారన్నారు. అలాగే అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ జగనన్న నవరత్నాలు అందజేస్తున్న విషయాన్ని వారికి తెలియజేశారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి పథకాలు రాకపోతే తమ దృష్టికి తీసుకొస్తే వారికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వేముల నాగయ్య, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ నిమ్మల శ్రీనివాసరావు, ఎఈలు సురేంద్ర, బాబునాయక్, కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామాభివృద్ధి అధికారి రవికుమార్, సర్పంచి మోసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లరూరల్: గ్రామోదయం కార్యక్రమం సమస్యల పరిష్కారానికి ఒక మార్గమని ప్రత్యేకాధికారి, డివిజన్ లెవల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ డి. గబ్రూనాయక్ అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామంలో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల అనుసారం ఎంపీడీఓ కాశయ్య ఆధ్వర్యంలో గ్రామోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాశయ్య, కరాలపాడు ప్రాథమిక వైద్యులు ప్రవీణ్‌రెడ్డి, సర్వశిక్ష అభియాన్ ఏఈ సురేశ్‌నాయక్, ఈవీఆర్‌డీ శంకర్‌రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజలి, ఏపీఎం సీహెచ్ జయరాం, పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, సచివాలయసిబ్బంది , అంగన్‌వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలకు సర్వ సిద్ధం



ముస్తాబైన ఈద్గా

పిడుగురాళ్ల: పవిత్ర రంజాన్ పండుగకు ఈద్గా ముస్తాబైంది..పట్టణంలోని జానపాడు రోడ్‌లో ముస్లింల నమాజ్ చేసుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లును పూర్తి చేశారు. గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశాలతో జానపాడు రోడ్డులోని ఈద్గా అందంగా ముస్తాబు చేశారు. ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు వచ్చేవారికి వుజూఖానాను నూతనంగా ఏర్పాటు చేశారు. అలాగే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఈద్గా వద్ద పెద్ద పెద్ద కూలర్లను ఏర్పాటు చేశారు. ఇందుకు గాను పిడుగురాళ్ల ముస్లిం సోదరులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

దాచేపల్లి : రంజాన్ పండుగ వేడుకలకు మసీద్‌లను సిద్ధం చేశారు. శనివారం జరుపుకునే పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా నమాజ్‌లు చేసేందుకు మసీద్‌లను సిద్ధ పరిచారు. దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ప్రత్యేకంగా నమాజ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పండుగ సందర్భంగా మసీద్‌లను విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

మాచర్ల: పట్టణంలోని 23వ వార్డులో ఉన్న ఈద్గాను రంజాన్ పండుగ సందర్భంగా శనివారం జరిగే నమాజ్‌కు సర్వం సిద్ధం చేశారు. ఈద్గా వద్ద టెంట్లు ఏర్పాటు చేసి పరిసరాలను శుభ్రం చేసి ప్రార్థనలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముస్లిం పెద్దలు ఏర్పాట్లు చేశారు. నూతనంగా ఈద్గా చుట్టూ నమాజ్‌కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రూ. 33 లక్షలతో ప్రహరీగోడ కట్టించి ఆర్చిని ఏర్పాటు చేశారు. పురపాలక సంఘం చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్ రమణబాబు ఆధ్వర్యంలో ఈద్గా ప్రాంతాన్ని మొత్తం శుభ్రం చేయించి ప్రార్థనకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు.

గజ ఈతగాళ్లకు దొరకని వ్యక్తి ఆచూకీ



బెల్లంకొండ: మేతకు వెళ్లిన గేదెలు నదిలోకి దిగడంతో వాటిని తోలుకురావడానికి వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని ఎమ్మాజీగూడెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ కె.అమీర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రామనబోయిన పెద్దఅల్లయ్య (45) గల్లంతైనట్లు తెలిపారు. అల్లయ్య రోజు మాదిరిగా గేదెలను మేతకు తోలుకుని వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో గేదెలు అన్నీ పక్కనే ఉన్న పులిచింతల ముంపు బ్యాక్‌వాటర్ అయిన కృష్ణా నదిలోకి దిగాయి. వాటిని తోలుకురావడానికి అల్లయ్య నదిలోకి దిగాడు. కాగా నదిలో చేపల కోసం వేసిన పాత వలలు అల్లయ్య కాళ్లకు చిక్కుకోవడంతో బయటకు రాలేక నదిలో మునిగిపోయినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు కాపాడానికి ప్రయత్నించినప్పటికీ నదిలో లోతు ఎక్కువగా ఉండడంతో ప్రయోజనం లేకుండా పోయింది. కాగా వెంటనే ఎస్ఐ అమీర్, రెవెన్యూ సిబ్బంది అల్లయ్య అచూకీ కోసం గజ ఈతగాళ్లతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపుగా ఐదు గంటల పాటు నదిలో గాలింపు చేసినప్పటికీ వ్యక్తి ఆచూకీ లభించలేదని, గాలింపు చర్యలు కొనసాగిస్తామని ఎస్ఐ తెలిపారు. కాగా గల్లంతయిన అల్లయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా ఒకరికి వివాహం అయింది, మరో కుమార్తె చదువుకుంటున్నట్లు తెలిసింది.

లేగదూడల పెంపకం పై రైతులకు అవగాహన

వెల్దుర్తి: రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశు గణ నాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగదూడల పెంపకం పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు పశువైద్యశాఖ ఉప సంచాలకులు డా'' నరసింహులు తెలిపారు. శుక్రవారం మండలంలోని శిరిగిరిపాడులో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు నరసింహులు మాట్లాడుతూ పాడి రైతులు, పశువైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. లేగదూడల అందాల పోటీల్లో 50 దూడలు పాల్గొన్నాయన్నారు. పశు పోషకులకు బహుమతులు అందించారు. లేగదూడల సంరక్షణ పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ నర్సరావుపేట జగదీష్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్, మాచర్ల డా'' ధనుంజయరెడ్డి, పశుగణాభివృద్ధి సంస్థ చేబ్రోలు ఎం సరిత, వెల్దుర్తి డా'' దిలీప్, దుర్గి సురేష్ నాయుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, సర్పంచ్ సపారపు లచ్చిరెడ్డి, దిరిసినాల హనిమిరెడ్డి, పశువైద్యశాల సిబ్బంది, శిరిగిరిపాడు రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు గిరిజన ద్రోహి

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్

వెల్దుర్తి: ఫ్యాక్షనిజాన్ని పెంచి పోషించిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హత్యలు, ప్రతికార హత్యలు గురించి, అక్రమ మైనింగ్ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మాచవరంలో జరిగిన గిరిజన శంఖారావం సభలో గిరిజనులకు ఇప్పటి వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. డబ్బులు ఇచ్చి సభలకు జనాన్ని తరలిస్తే సరిపోదని గిరిజన శంఖారావం సభలోనూ గిరిజన నేతలతో మాట్లాడనీయకుండా వారి గొంతు నొక్కారని ఆరోపించారు. 14 ఏళ్ళు సీఎంగా చేసిన మాజీ సీఎం చంద్రబాబు గిరిజనుల అభివృద్ధిని విస్మరించి గిరిజన ద్రోహిగా మిగిలారన్నారు.

పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే

వెల్దుర్తి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మాచర్ల పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీలోకి చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మండలంలోని పిచ్చయ్యబావితండాకు చెందిన రమావత్ వెంకటేష్‌నాయక్, బుయ్యానాయక్, బుజ్జిబాయి, బాలునాయక్, మేఘావత్ హనుమంత్ నాయక్, బాణావత్ బాలునాయక్‌తో పాటు లోయపల్లి సర్పంచ్ బలిగొడుగుల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ మేఘావత్ బాలునాయక్, మేఘావత్ హనుమంతునాయక్‌ల ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీలో చేరినవారికి సముచిత స్థానం కల్పించి వారికి కావాల్సిన పనులను అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

అందరి ఆరోగ్యం కోసమే ఇంటింటికీ వైద్యం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి గబ్రునాయక్, జ్యోతి

మాచర్ల రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వచ్చి పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని మండల ప్రత్యేకాధికారి గబ్రూనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కంభంపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణ కోసం 104 వాహనం ద్వారా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి రోగులను పరీక్షించి మందులు అందించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్న పీహెచ్‌సి వైద్యశాలలో నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ చేసి పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి కోటేశ్వరరావు, పీహెచ్‌సి వైద్యులు ప్రదీప్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, 104, ఎఎన్ఎం, ఆశ వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి



మాట్లాడుతున్న ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి

గురజాల : మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి మంచినీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండల స్థాయి అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరి సహకారాలు ఉండాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, ఎంపీడీఓ ఫణికుమార్ , కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్ తదితరులున్నారు.

ఫేష్ వాష్ చేసుకో.. సురక్షితంగా ప్రయాణం సాగించు



తెల్లవారుజామున పట్టణశివారుల్లో డ్రైవర్లకుఫేష్ వాష్ చేయిస్తున్న సీఐ

పిడుగురాళ్ల: రాత్రి సమయాల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు సూచించారు. పట్టణంలోని ఖలీల్ సమీపంలోని బైపాస్ వద్ద శుక్రవారం తెల్లవారు జామున వాహన డ్రైవర్లకు ఫేష్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. లారీలు, పద్దె ట్రాలీవాహనాలు, ప్రైవేటు, ఆర్టీసీ బస్సులను ఆపి డ్రైవర్ల చేత ఫేష్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం వాహనాలను నడవాలని వారికి సూచించారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటల సమయంలో నిద్ర వస్తోంది కాబట్టి డ్రైవర్లు ఆ సమయంలో ఫేష్‌వాష్ చేసుకుంటే వారు వాహనాలను సురక్షతంగా నడిపే అవకాశం ఉంటుందని ఈసందర్భంగా సీఐ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు పవన్‌కుమార్, పఠాన్ రబ్బానీ ఖాన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

మాచవరం: మండలంలోని వేమవరం, పిల్లుట్ల గ్రామాల్లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా వరి పంట కోత ప్రయోగం చేపట్టారు. వేమవరం గ్రామానికి చెందిన హనుమంతరావు నాయక్ వరి పొలంలో 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో వరి పంట కోసి, నూర్పిడి చేయగా 17.100 కిలో గ్రాములు పంట దిగుబడి వచ్చింది. ఎకరాకు 38 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

గురజాల : రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్సు సెల్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎం సంధ్యారాణి సూచించారు. ఆమె తన కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ అర్హులైన కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు కొత్తగా అటవి హక్కు పత్రాలు పొందిన రైతులు వైఎస్సార్ రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆటవి హక్కు పత్రంతో పాటు ఆధార్ , బ్యాంక్ ఖాతా, మొబైల్ నెంబరును తీసుకుని రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తప్పనిసరిగా రైతులు ఆధార్ నంబరుకి సెల్ నెంబరు, పొలం ఖాతా నంబరుకు ఆధార్ నంబరు, సెల్ నంబర్, బ్యాంకు ఖాతాకు ఆధార్, సెల్ నెంబరు అనుసంధానం చేసుకుని యుండాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఏ గ్రేడ్ ధాన్యం బస్తా రూ.1540లు, దర ప్రకటించడం జరిగిందన్నారు.

నేడు రామాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

దాచేపల్లి : మండలంలోని రామాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ శుక్రవారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కన్వీనర్ కృష్ణ కోరారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

దాచేపల్లి : మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి వార్షిక కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామివారి తిరునాళ్ల సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెదహనిమిరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ పాస వెంకటనాగయ్య, నాయకులు పూజలు చేశారు.

మహారాజశ్రీ గురజాల 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

గార్డియన్ O.P.No. 169/2023

బిట్వీన్

ఆతుకూరి స్వప్న, W/o: లేట్ ఆతుకూరి నాగరాజు, డోర్ నెం: 8-354, పిడుగురాళ్ళ టౌన్, పల్నాడు జిల్లా. -పిటీషనరు

మరియు

నిల్(NIL) -రెస్పాండెంట్

పై నెంబరు O.Pలో పిటీషనర్ అయిన ఆతుకూరి స్వప్న తన మైనర్ కుమార్తెలైన 1.ఆతుకూరి వర్షిత, 2.ఆతుకూరి వరలిసాయిలకు చెందిన దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తులను షేక్ జాన్ షాహిద్‌నకు మైనర్ల తరుపున విక్రయించుటకు పై కోర్టు వారి అనుమతిని కోరుతూ పై నెంబరు పిటిషన్‌ను దాఖలు చేసియున్నారు. ఇందు నిమిత్తము ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల పైన తెలిపిన కోర్టులో ది.06.05.2023న ఉదయం 10.30లకు హాజరై తమ యొక్క అభ్యంతరములను స్వయముగా కానీ లేక న్యాయవాది ద్వారా కాని పై కోర్టు వారికి తెలుపుకొనగలరు. అట్లు తెలియపరుచుకొనని యెడల పై కోర్టు వారు ఎవరికీ ఎట్టి అభ్యంతరములు లేవని నిర్ణయించుకుని తదుపరి చర్యలు తీసుకొనగలరని ఇందుమూలంగా పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పిడుగురాళ్ళ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ యిలాకా, పిడుగురాళ్ళ రెవెన్యూ గ్రామానికి చెందిన సర్వే నెం.198లోని, పిడుగురాళ్ళ మున్సిపాలిటి పరిధిలోగల డోర్‌నెం.8-690కి దగ్గరలో ఈ దిగువ హద్దులలో ఉన్న 656.1చ.గ భాగ స్థలము హద్దులు తూర్పు: 125.8అడుగుల జివంగుల ఆంజనేయులు లోగిలి. దక్షిణం: 50 అడుగుల బజారు, వెడల్పు 64లింకులు పడమర: 125.8 అడుగుల బాలికోయిన హనుమాయమ్మ స్థలము, ఉత్తరం: 44.1 1/2అడుగులు షేక్ హుస్సేన్‌బీ మరియు మొక్కరాల వెంకటేశ్వరమ్మ స్థలం.

ఆర్.సాంబశివరావు- ఫోన్: 9440438199
వై.కాశి కొండారెడ్డి- ఫోన్: 9848560627
పిటీషనరు తరుపు న్యాయవాదులు